క్లుప్తంగా

మిరపలో పంటకోత ప్రయోగం


చింతమానుపల్లెలో మిరపలో పంటకోత ప్రయోగం చేపట్టిన వ్యవసాయాధికారులు

సి.బెళగల్: మండల పరిధిలోని చింతమానుపల్లె గ్రామంలో మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అధికార యంత్రాంగంతో కలిసి పంట కోత ప్రయోగం చేపట్టారు. గురువారం గ్రామంలోని రైతు సరోజమ్మ పొలంలోని మిరప పంటలో మొదటి కోతలో భాగంగా 5.5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో దిగుబడులను కోత కోసి తూకం వేయగా 16.5 కేజీల దిగుబడి వచ్చిందని, ఈ మేరకు ఎకరానికి 22 నుంచి 24 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధ్యమవుతుందని తెలిపారు. ఇది సాధారణం కన్నా కాస్త మెరుగైన దిగుబడిగా ఏఓ తెలిపారు. వ్యవసాయ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, వీఆర్‌ఏ వెంకటరాముడు, రైతు రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాలలో వైద్య శిబిరాలు


సి.బెళగల్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

సి.బెళగల్: ఎట్టకేలకు వైద్య అధికారులు, సిబ్బంది గురువారం గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సి.బెళగల్‌లో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో వైద్యాధికారుల అలసత్వంపై జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ రాముడును ఎంపీపీ బొంతల మునెప్ప ఆదేశించడంతో ఆ మేరకు జిల్లా కేంద్రానికి ఫిర్యాదు పంపారు. దీంతో జిల్లా అధికారులు స్థానిక వైద్యులపై మండిపడుతూ.. గ్రామాలలో వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో మండలంలోని ప్రధాన గ్రామాలైన కంబదహాల్, సి.బెళగల్, పోలకల్‌తో పాటు ఆయా గ్రామాలలో సిబ్బంది వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి భక్తులకు వైద్య సేవలను, మందులను ఉచితంగా అందజేశారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయించండి


కంబదహాల్‌లో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ సుమంత్

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో గృహ నిర్మాణ లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని, ఈ మేరకు హౌసింగ్ శాఖ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని మండల హౌసింగ్ ఏఈ సుమంత్ ఆదేశించారు. ఆయన గురువారం మండల హౌసింగ్ సిబ్బందితో కలిసి కంబదహాల్ గ్రామంలో పర్యటించి జగనన్న కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై సూచనలు చేశారు. గ్రామంలో 41 మంది లబ్ధిదారులు ఉండగా నిర్మాణ దశ ప్రారంభం కానివి-17, బేస్‌మట్టం దశలో-19, రూఫ్ లెవల్ మూడు, ఆర్‌సీ లెవల్ ఒక్కటి, మరొకటి పూర్తిగా నిర్మాణం జరిగినట్లు వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న వెల్లడించారు.

జాతర పోస్టర్ విడుదల


గడివేములలో మూలపెద్దమ్మ జాతర పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో కొలిచేవారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న మూలపెద్దమ్మ జాతర పోస్టర్లను జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, చైర్మన్ తలారి చిన్నన్న చేతుల మీదుగా ఆవిష్కరించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో పోస్టరును విడుదల చేశారు. ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఈఓ నాగ ప్రసాద్ వెల్లడించారు. కార్యక్రమంలో ఈఓలు మోహన్, నాగప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం నాగేశ్వర రెడ్డి, చంద్రమౌళీశ్వర రెడ్డి, ధర్మకర్త కేశాలు పాల్గొన్నారు.

21న వాహనాల వేలం

కర్నూలు: మద్యం, నాటుసారా రవాణా చేస్తూ తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 21వ తేదీన కర్నూలు సెబ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు సీఐ సత్యనారాయణ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ద్విచక్రవాహనాల కోసం రూ.5 వేలు, ఆటో, కారు, లారీ, క్యారేజ్ ఆటోలకు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కర్నూలు సెబ్ స్టేషన్‌కు వచ్చి దరావత్తు చెల్లించి టోకెన్ తీసుకుని వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. వాహనాలు దక్కని వారికి డిపాజిట్ సొమ్ము వాపసు ఇస్తామని తెలిపారు. వాహనాలు దక్కించుకున్నవారు వేలం పాడిన సొమ్మును 18 శాతం జీఎస్టీతో కలిపి వెంటనే చెల్లించి వాహనాలను స్వాధీనం చేసుకోవచ్చన్నారు.


జాతరలో వెలసిన మిఠాయిల దుకాణం


చిన్నారుల ఆట బొమ్మలను కొనుగోలు చేస్తున్న దృశ్యం


నోరూరించే మాంసపు కడ్డీలు


హంద్రీలో ఈత కొడుతున్న చిన్నారులు

గోరంట్లలో జాతర సందడి

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం గోరంట్ల శ్రీలక్ష్మీమాధవ స్వామి జాతరలో సందడి నెలకొంది. గోరంట్ల జాతర అంటేనే రైతులకు సంబరంగా ఉంటుంది. వ్యవసాయ పనిముట్లు, సేద్యపు ఎద్దుల క్రయ విక్రయాలకు జాతర పెట్టింది పేరు. జాతరలో మొత్తం కిలోమీటర్ పొడవునా రెండు వేలకు పైగా వ్యవసాయ పనిముట్లు, కాడెద్దులు, మిఠాయి అంగళ్లు, గాజులు, ఆటవస్తువుల దుకాణాలతో పాటు, మాంసపు దుకాణాలు, ముఖ్యంగా మాంస ప్రియులకు నోరూరించే కడ్డీల మాంసం దుకాణాలను భారీగా ఏర్పాటు చేశారు. అలాగే చిన్నారులకు ఆట విడుపు కోసం రంగుల రాట్నం, ఎగిరే నెట్ వంటివి ఏర్పాటు చేశారు. హంద్రీ నదిలో నీరు పుష్కలంగా ఉండడంతో చిన్నారులతో పాటు, పెద్దలు ఈత కొడుతూ ఆనందాన్ని ఆస్వాదిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలిరావడంతో జాతర కిటకిటలాడుతోంది. 20 రోజుల పాటు జరిగే గోరంట్ల జాతరను ప్రతి రోజు వేలాది మంది సందర్శించి ఆనందోత్సవాల్లో మునిగితేలుతుంటారు.


అమ్మకానికి ఉంచిన ఎద్దులు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎద్దుల బండ్ల సామగ్రి, (ఇన్‌సెట్) వ్యవసాయ సామగ్రి, కొనుగోలు చేస్తున్న రైతులు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కోడుమూరు రూరల్: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుని పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో పాసవ్వాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని అమడగుంట్ల హైస్కూల్‌ను పీడీ అమర్‌నాథ్ రెడ్డి సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా పరీక్షల పట్ల భయాన్ని వీడి ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో చదువుకోవాలన్నారు. ముఖ్యంగా గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు పది విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అంతకుముందు డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి అమడగుంట్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలు, ఉపాధి సిబ్బందికి అనేక సూచనలిచ్చారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రతి కూలీకి రోజుకు రూ.250 వేతనం పడుతుందని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పీడీ సూచించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ జయంతి వెంట ఉన్నారు.


అమడగుంట్ల హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

రైతులకు అవసరమైన పనులు చేయండి


ఎల్‌కే తాండలో ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ఏపీఓ బాలాజీ నాయక్

గడివేముల: మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ప్రజలు, రైతులకు అవసరమైన పనులను గుర్తించాలని ఏపీడీ బాలాజీనాయక్ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎల్‌కే తాండ గ్రామంలో అమృత్ సరోవర్ పథకం కింద లక్ష్మయ్య కుంట పూడికతీత పనులను ప్రారంభించారు. ఏపీడీ మాట్లాడుతూ.. కుంటలో మట్టిని తొలగించేందుకు ప్రభుత్వం రూ.9 లక్షలు కేటాయించిందన్నారు. ప్రతి రోజు రెండు వందల మంది కూలీలు పనిచేసే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు, రైతులు అడిగిన పనులను గుర్తించి వాటికి ఎస్టిమేషన్ వేయాలన్నారు. కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. అనంతరం గని, ఒండుట్ల గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. వేసవికాలం కావడంతో కూలీలకు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. వైస్ ఎంపీపీ కాలునాయక్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శనగ దిగుబడులకు మద్దతు ధర

కోడుమూరు రూరల్: రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేసిన రైతులంతా మద్దతు ధరకు తమ దిగుబడులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. గురువారం మండలంలోని ప్యాలకుర్తి రైతు భరోసా కేంద్రాలను ఏఓ రవిప్రకాష్ సందర్శించి రైతులతో మాట్లాడారు. రబీ పంటలు సాగు చేసిన రైతుల జాబితాను ఆర్‌బీకేల వద్ద ప్రదర్శించడం జరిగిందని, రైతులు తమ పేర్లను సరి చూసుకోవాలన్నారు. ఆర్‌బీకే సిబ్బంది కేంద్రాల్లో అందుబాటులో ఉండి రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఏఓ ఆదేశించారు. ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ప్యాలకుర్తి ఆర్‌బీకేలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

అమరజీవికి ఘన నివాళి


విద్యార్థికి పరీక్ష కిట్ అందిస్తున్న దృశ్యం

కల్లూరు: తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేస్తూ ప్రాణాలు అర్పించిన అమరుడు పొట్టి శ్రీరాములు అని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజగోపాల్ అన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లోని ఠాగూర్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు ఇల్లూరు సుధాకర్, శ్రీధర్ హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని విద్యార్థులకు వివరించారు. శ్రీరాములు జీవితంపై ప్రశ్నలు వేసి సరైన సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులు అందించారు. పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు

గడివేముల: రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అందరికీ ఆదర్శప్రాయుడని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు ప్రాణాలర్పించి ప్రజలకు స్ఫూర్తిగా నిలిచాడన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, వీఆర్వోలు సామన్న, హరిచంద్ర, హరీంద్ర, సర్వేయర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రైనేజీ నిర్మాణ పనులు

కల్లూరు: కె.మార్కపురం గ్రామం ఎస్సీ కాలనీలో రూ.4 లక్షలతో సీసీ డ్రైనేజీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి గ్రామంలో జరుగుతున్న డ్రైనేజీ పనులు, జల్‌జీవన్ మిషన్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తున్నామన్నారు. ఇందుకోసం మండలవ్యాప్తంగా అన్ని గ్రామాలకు రూ.6.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే రెమడూరు, నాయకల్లు, ఎర్రకత్వ, యాపర్లపాడు, చిన్నటేకూరు, బస్తిపాడు గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చామన్నారు. మిగతా గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని వెల్లడించారు.


కె.మార్కపురంలో జరుగుతున్న డ్రైనేజీ పనులు

రోడ్డు నిబంధనలు పాటించాలి

గూడూరు రూరల్: శ్రీశైలానికి కాలినడకన వెళ్లే కర్ణాటక భక్తులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఎస్‌ఐ సోమ్లానాయక్ సూచించారు. పెంచికలపాడులో గురువారం పాదయాత్రికులకు గ్రామ పెద్దలు చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తితో వందలాది కిలోమీటర్లు నడుచుకుంటూ వెళుతున్న పాదయాత్రికులకు స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు ఉచిత భోజన వసతి కల్పించడం అభినందనీయమన్నారు. పాదయాత్రికులు రోడ్డు మధ్యలో వెళ్లకుండా నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకుని భ్రమరాంబా మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులు పొందాలన్నారు. ఎంపీడీఓ మాధవీలత, సింగిల్ విండో అధ్యక్షుడు ఎల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు 870 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి గురువారం 870 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో ప్రస్తుతం 0.813 టీఎంసీల నీటి నిల్వ ఉండగా కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. డ్రాయింగ్ పోటీల వల్ల విద్యార్థుల్లో ఆలోచనా సామర్థ్యం, నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 14 మంది గైర్హాజరు

కోడుమూరు రూరల్: మండలంలో ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గురువారం నిర్వహించిన తెలుగు, హిందీ, ఇతర లాంగ్వేజ్ పరీక్షలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 221 మందికిగాను నలుగురు గైర్హాజరు కాగా, మోడల్ స్కూల్‌లో 221 మందికిగాను 10 మంది గైర్హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పద్మావతి, ఆశాజ్యోతి తెలిపారు.

వంద శాతం హాజరు ఉండాలి


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాణ్యం: గ్రామ సచివాలయ సిబ్బందికి వంద శాతం హాజరు ఉండాలని ఎంపీడీఓ దస్తగిరి సూచించారు. ఆయన గురువారం మండల పరిధిలోని కొలూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, అనవసరంగా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు. అలాగే ప్రతి సచివాలయంలో పది సర్వీస్ రిక్వెస్టులు తప్పకుండా చేయాలన్నారు. సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, ఆయుష్మాన్ భారత్ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. ఏపీఓ విజయరాణి, సిబ్బంది ఉన్నారు.

20న వ్యాసరచన పోటీలు

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు ప్రమాదాల నివారణపై ఈ నెల 20వ తేదీన వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక హెడ్ పోస్టాఫీసులో సాయంత్రం 4 గంటల నుంచి 'నీవే హీరోగా రోడ్డు ప్రమాదాలు ఎలా నివారిస్తావు' అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం 10 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఖేలో ఇండియా పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): చండీఘడ్‌లోని మోహాల్ యూనివర్సిటీలో ఈనెల 15 నుంచి జరుగుతున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 61 కిలోల విభాగంలో కర్నూలు రాయలసీమ యూనివర్సిటీకి చెందిన షేక్ అబ్దుల్లా 5వ స్థానంలో నిలిచి ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

పాణ్యం: నవధాన్యాల సాగుతో భూమి సారవంతంగా మారుతుందని, మండల ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ విజయభాస్కర్ అన్నారు. గురువారం గోరుకల్లు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది మొత్తం భూమి పచ్చదనంతో ఉండేలా నవధాన్యాలు సాగు చేసుకోవాలన్నారు. అలాగే 2023లో ఖరీఫ్ సంబంధించి విత్తన శుద్ధి చేసుకునే విధానంపై క్లుప్తంగా వివరించారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేసి జల్లెడ పట్టిన బంకమన్ను, ఘన జీవామృతం, బుడిద ఉపయోగించి విత్తన గుళికలను తయారు చేయడంపై అవగాహన కల్పించారు. ఇలా చేయడం ద్వారా విత్తనాలకు చీమలు పట్టకుండా, పక్షులు తినకుండా ఉపయోగపడుతుందని వివరించారు. సకాలంలో వర్షాలు పడకపోయినా వర్షం కురిసినప్పుడు నీటిని తీసుకొని మొలకెత్తుతయన్నారు. ఇలా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూసారం మరింత పెంచిన వారమవుతామన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగరాజు, కరిముల్లా షాఖాద్రి, సిసింద్రీ, మహేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.


విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులకు అండగా ప్రభుత్వం

గడివేముల: రైతులు పండించిన పంట దిగుబడులకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి వారికి అండగా నిలుస్తోందని నంద్యాల ఏడీఓ రాజశేఖర్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న మద్దతు ధరకు రైతుల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. జొన్నలకు క్వింటా రూ.2,970 కల్పించడంతో పాటు లేబర్ చార్జెస్ కింద రూ.22 ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఆరు జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాలలో కొనుగోలు చేస్తున్న జొన్నల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆర్బీకేను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏఓ హేమసుందర్‌రెడ్డి, వీఏఏ భావన తదితరులు ఉన్నారు.


కరిమద్దెలలో జొన్నల నాణ్యతను పరిశీలిస్తున్న ఏడీఏ రాజశేఖర్

రథోత్సవం జయప్రదం చేయండి

కోడుమూరు రూరల్: కోడుమూరులో హంద్రీ నది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవి ఆలయంలో ఉగాది పండుగ పురస్కరించుకుని నిర్వహించే రథోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి కోరారు. ఆయన గురువారం వల్లెలాంబ దేవి రథోత్సవ ఆహ్వాన కరపత్రాలను సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఉగాది సందర్భంగా ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు వల్లెలాంబ దేవి ఆలయంలో వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. 21న గోపూజ, గణపతి పూజ, గంగ పూజ, సాయంత్రం ప్రభోత్సవం, 22న ఉగాది రోజున అమ్మవారి రథోత్సవం, 23న పారువేట, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని, ప్రజలంతా ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు పూలవాసు, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, సాలప్ప, శ్రీనివాసులు తదితరులున్నారు.


వల్లెలాంబ రథోత్సవ ఆహ్వాన కరపత్రాలను విడుదల చేస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్ రెడ్డి

తీగ జాతి మొక్కలు పెంచండి

కల్లూరు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ) చుట్టూ తీగ జాతి మొక్కలను పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజు నాయుడు సూచించారు. గురువారం చిన్నటేకూరు చెత్త సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. షెడ్డులో వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించారు. చెత్త సేకరణపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గత ఆరు మాసాల నుంచి 900 కేజీల వర్మీకంపోస్టు తయారు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి చిన్న లచ్చప్ప డీపీఓకు వివరించారు. అందుల్లో 720 కేజీలు విక్రయించగా గ్రామ పంచాయతీకి రూ.7,200 ఆదాయం, పొడి చెత్త అమ్మకం ద్వారా రూ.3000 ఆదాయం వచ్చిందని పంచాయతీ కార్యదర్శి తెలియజేశారు.


వర్మీకంపోస్టు తయారీని పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజునాయుడు


వెంకాయపల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద నిలిచిన మురుగునీరు

లోపించిన పారిశుద్ధ్యం

- ముక్కు మూసుకుని అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు
- టెండర్ పూర్తయి ఏడాది గడుస్తున్నా డ్రైనేజీ కాల్వ నిర్మించని వైనం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థానం వద్ద డ్రైనేజీ కాల్వ లేక మురుగు నీరు నిలిచి పందుల స్వైరవిహారంతో కంపుకొడుతోంది. ఆలయంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ముక్కు మూసుకుని దర్శించుకునే దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. గతేడాది మే 21వ తేదీన రూ.7 లక్షలకు డ్రైనేజీ నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. ఏడాది గడుస్తున్నా డ్రైనేజీ నిర్మాణం నేటి వరకూ చేపట్టకపోవడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణానికి సంబంధించి కర్నూలుకు చెందిన ముక్తా కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ నవీన్ ఒప్పందం చేసుకున్నారు. అయితే డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు కేవలం పరిశీలనతోనే కాలయాపన చేస్తున్నారని, ఇంత వరకూ నిర్మాణ పనులు ప్రారంభించలేదని దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి వెల్లడించారు. ఇప్పటికైనా దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆలయ పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.